క్లుప్తంగా

రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: తాళ్లూరులో స్వయంభూగా వెలిసిన రామలింగేశ్వరునికి ప్రత్యేక అలంకరణ చేశారు. వైశాఖ శుద్ధ పాడ్యమి సోమవారం సందర్భంగా స్వామి వారు పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గ్రామ దేవత డెక్కల పోలమ్మతల్లి జాతర సందర్భంగా గ్రామానికి వచ్చిన ఆడపడుచులు స్వామి వారిని దర్శించుకున్నారు.

మజ్జిగ పంపిణీ

జగ్గంపేట: కాట్రావులపల్లి గ్రామంలో జరిగిన ఏగులమ్మ జాతరలో అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం 5వేల మంది భక్తులకు మజ్జిగ పంపిణీ చేసింది. జాతర మహోత్సవానికి కాట్రావులపల్లి పరిసర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. వేసవి తాపం ఎక్కువగా ఉండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అయ్యప్ప సంఘం జాగ్రత్తలు తీసుకుంది. అమ్మవారి తీర్థమహోత్సవం కమిటీ నేతలు వైభవంగా నిర్వహించారు.

కొండేపూడి శ్యాంబాబుకు నివాళి



లోవ కొత్తూరులో శ్యాంబాబుకు నివాళులు అర్పిస్తున్న నాయకులు

తుని: మాదిగల రిజర్వేషన్ కోసం పోరాటం చేసిన ఏపీ ఎంఆర్‌పీఎస్ నాయకుడు కొండేపూడి శ్యాంబాబును యువత స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా అధ్యక్షుడు పలివెల శివమణి అన్నారు. సోమవారం తుని మండలం లోవకొత్తూరులో ఏపీ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతాప సభ కార్యక్రమంలో కొండేపూడి శ్యాంబాబు చిత్ర పటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలివెల సతీష్, సీహెచ్ నాగేశ్వరరావు, కాకాడ సంగన్న, పలివెల శ్రీనుబాబు, అశోక్‌బాబు, బాబ్జీ, అప్పలకొండ, చరణ్, బన్ని, రమేష్, రామరాజు పాల్గొన్నారు.

మే డే వేడుకలను జయప్రదం చేయండి



తునిలో మేడే వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

తుని: అసంఘటిత కార్మికులు మేడే వేడుకలను జయప్రదం చేయాలని సీఐటియూ అధ్యక్ష, కార్యదర్శులు నక్కెళ్ల శ్రీనివాస్, ధనలక్ష్మి కోరారు. సోమవారం తుని పట్టణం కొండవారిపేట కమ్యూనిటీ హాలులో జె.రాముడు అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించి, మేడే వేడుకలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. తుని తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే వేడుకలకు అందరూ హాజరు కావాలని కోరారు. నాగేశ్వరరావు, దివ్య, మహాలక్ష్మి, సుజాత, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్ష



తుని డిపోలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న కండక్టర్లు

తుని: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం తుని డిపో ఇన్‌గేట్ వద్ద రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఎన్‌ఎంయూ డిపో కార్యదర్శి సీహెచ్ సాయిరాం ఆధ్వర్యంలో కండక్టర్లు పి.రమాదేవి, ఎ.దేవి, ఎస్‌కే జరీనా బేగం, సీహెచ్‌వీవీ ప్రసాద్ నిరాహార దీక్షలో పాల్గొన్నారు. మంగళవారం కూడా దీక్ష కొనసాగుతుందని సాయిరాం తెలిపారు. దీక్ష చేస్తోన్న కండక్టర్లకు సహచర ఉద్యోగులు సంఘీభావం తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని ఎన్‌ఎంయూ దీక్షలు

గోకవరం: పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆర్టీసీ డిపో నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్ఎస్ కుమారి అధ్యక్షతన బి.చంద్రరావు, నారాయణ, శ్రీనివాస్, డీఎస్ రావు, తమ్మన్నదొర, మోహన్‌రావు, ఫణిశంకర్, బి.శ్రీనివాస్, నరేష్‌కుమార్, చంద్రమ్మ దీక్షలు చేపట్టారు. ఆర్టీసీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ నియామకం

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం ప్రకటించింది. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా శంఖవరం మండలం నెల్లిపూడికి చెందిన బద్ది మణి, వైస్ చైర్మన్ ప్రత్తిపాడు మండల ఒమ్మంగి గ్రామానికి చెందిన సుంకర సోమరాజు మరో 13 మంది కమిటీ సభ్యులుగా నియమితులయ్యారు. నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

సంపద సృష్టి ఎక్కడా?

- నిరుపయోగంగా సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కేంద్రాలు
- పట్టించుకోని అధికారులు



గుమ్మరేగుల్లో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

రౌతులపూడి: గ్రామీణ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పంచాయతీలకు ఆదాయం వచ్చేలా ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు(సాలిడ్ వెల్త్ ప్రాసెసింగ్ కేంద్రాలు) నిరుపయోగంగా మారాయి. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు పశువుల శాలలుగా, అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. ఘన, ద్రవ పదార్థాలను(తడి, పొడి చెత్త పదార్థాలు) వేరు చేసి తద్వారా చెత్త నుంచి సంపద సృష్టిద్దామన్న ప్రభుత్వం లక్ష్యం ఆచరణలో విఫలమైతుందని తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సంపద తయారీ కేంద్రాల నిర్వహణ ఇలా

గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ముందుగా గ్రామాల్లో స్థల సేకరణ చేసి ప్రభుత్వ అనుమతులు పొందిన తరువాత ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్లు నిర్మాణం చేపట్టాలి. అనంతరం ప్రతి ఇంటికి రెండు చెత్త బుట్టలు సరఫరా చేయాలి. ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక ట్రైసైకిల్ కొనుగోలు చేయాలి. ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒక గ్రీన్ అంబాసిడర్‌ను నియమించాలి. వాచ్‌మన్ షెడ్, వాచ్‌మన్ నియామకం చేపట్టాలి. వార్డు కమిటీలను ఏర్పాటు చేయాలి. విద్యుత్, నీటి, టాయిలెట్ సౌకర్యం కల్పించాలి. జాతీయ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేయాలి. షెడ్డు పరిసర ప్రాంతాల్లో ఆహ్లాదకరంగా ఉండేలా పచ్చదనం, మొక్కల పెంపకం చేపట్టాలి.

అయితే గ్రామాల్లో ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. ప్రతి ఇంటికి తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు రెండు రంగుల ప్లాస్టిక్ తొట్టెలు సరఫరా చేయాల్సి ఉన్నా ఎలాంటి తొట్టెలు పంపిణీ జరగలేదు. అదేవిధంగా గ్రామాల్లో సంపద సృష్టి కేంద్రాల నిర్వహణకు సంబంధించి గ్రీన్ అంబాసిడర్లను నియమించలేదు. కొన్ని గ్రామాల్లో విద్యుత్, నీటి, టాయిలెట్ వంటి మౌలిక సదుపాయాలను కూడా ఏర్పాటు చేయలేదు. ఘన, ద్రవ చెత్త పదార్థాలను తరలించేందుకు అవసరమైన ట్రైసైకిళ్లు మచ్చుకైనా కనిపించలేదు. ప్రభుత్వం నిబంధనల మేరకు తడిపొడి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిర్వహణ చేపట్టాల్సి ఉన్నా గ్రామాల్లో ఆ విధమైన చర్యలు కనిపించడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం సంపద సృష్టి కేంద్రాల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

13 పంచాయతీల్లో నిర్మాణాల్లేవ్

మండలంలోని 26 పంచాయతీలున్నాయి. ప్రతి గ్రామ పంచాయతీకి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. అయితే 26 పంచాయితీలకు 13 కేంద్రాలు ఉన్నాయి. అవి ఎ.మల్లవరం, దిగువశివాడ, గంగవరం, గిడజాం, గుమ్మరేగుల, జల్దాం, ఎం.కొత్తూరు, ములగపూడి, ఎస్ఎస్ పట్నం, పారుపాక, రాజవరం, రాఘవపట్నం, ఉప్పంపాలెం గ్రామాల్లో మాత్రమే కేంద్రాలు నిర్మించారు. మిగిలిన 13 పంచాయతీల్లోను నిర్మాణాలు చేపట్టలేదు. నిర్మాణాలు చేపట్టిన పదమూడు పంచాయతీల్లోను ప్రస్తుతం నిరుపయోగంగానే దర్శన మిస్తున్నాయి. తప్ప ఏవిధమైన సంపద సృష్టి జరగడం లేదని స్థానికులు వివరిస్తున్నారు.

నిర్వహణ చేపడితే బాగుంటుంది

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వమే నిధులు సమకూర్చి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వాటి నిర్వహణ చేపడితే కొంత వరకు ఉపయోగముంటుంది. గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన ఘన, ద్రవ పదార్థాల చెత్త నుంచి ఎరువులు తయారీ, ఇతర ఘన పదార్థాల నుంచి ప్రాసెసింగ్ చేసి అమ్మకాలు చేపట్టవచ్చు. దీని ద్వారా సంపద సృష్టించవచ్చు.

– బచ్చల కొండబాబు, గుమ్మరేగుల

అన్ని చర్యలూ చేపడతాం

గ్రామ పంచాయతీల సహకారంతో నిర్వహణ చేపడుతున్నాం. ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల నిర్వహణకు సంబంధించి తొట్టెలు, కొన్ని గ్రామాలకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశాం. గ్రీన్ అంబాసిడర్లు, వాచ్‌మన్ నియమకాలకు నిధులు కొరత ఉంది. నిర్మాణాలు చేపట్టిన గ్రామాల్లో పర్యటించి తడి, పొడి చెత్త నుంచి సంపద తయారీకి సంబంధించి అన్ని చర్యలు చేపడతాం. కొన్ని గ్రామాల్లో స్థల సేకరణ చేపట్టి నిర్మాణాలు చేపడతాం. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు వాటి నిర్వహణకు అవసరమైన అన్ని చర్యలూ చేపడతాం.

– శ్రీరామచంద్రమూర్తి, ఈఓపీఆర్‌డీ, రౌతులపూడి

ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కోటనందూరు: 2025–26 విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంఈఓ ఏవీఎస్ శ్రీనివాస్ సోమవారం తెలిపారు. విద్యార్థులు మే 2వ తేదీ నుంచి 19 తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 29న లాటరీ పద్ధతిలో అధికారులు ఫలితాలు వెల్లడిస్తారన్నారు. జూన్ 8వ తేదీ నుంచి ఎంపికైన పాఠశాలల్లో విద్యార్థులు చేరాల్సి ఉంటుందని ఎంఈఓ వివరించారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు చేయూత



అంగన్‌వాడీ కేంద్రాలకు సామగ్రిని అందజేస్తున్న అస్సాగో ప్రతినిధులు

గోకవరం: గుమ్మళ్లదొడ్డిలోని అస్సాగో ఇథనాల్ పరిశ్రమ గ్రామంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలకు చేయూతనందించింది. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల అభ్యర్థన మేరకు ఎస్సీకాలనీ, బీసీ కాలనీ, ఓసీ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు రైస్‌కుక్కర్లు, కుర్చీలు, పిల్లల ఆటవస్తువులు, వంట సామగ్రి, తదితర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అస్సాగో పరిశ్రమ మేనేజ్మెంట్ సభ్యులు జి.వెంకటేశ్వరరావు, వివేక్‌కుమార్‌శుక్లా, ఐ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మెప్మాకు మహిళలంటే గౌరవం లేదు

- వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ సామంతుల హైమావతి ధ్వజం
- రసాభాసగా కౌన్సిల్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ సామంతుల హైమావతి

ఏలేశ్వరం: నగర పంచాయతీ పరిధిలోని మెప్మా సంస్థకు మహిళలంటే గౌరవం లేదని వైఎస్సార్ సీపీ 12వ వార్డు కౌన్సిలర్ సామంతుల హైమావతి ధ్వజమెత్తారు. డ్వాక్రా గ్రూపులన్నా, మహిళలన్నా మెప్మా టీఎంసీ సాయికుమార్ చులకనగా చూస్తున్నారని ఆమె ఆరోపించారు. లంచాలు ఇస్తే డ్వాక్రా గ్రూపులకు రుణాలు మంజూరు చేస్తున్నారని, తన వార్డు పరిధిలోని సాయితేజస్విని గ్రూపు సభ్యులు డబ్బులు ఇవ్వకపోవడంతో రుణం మంజూరు చేయలేదని హైమావతి ఆరోపించారు. మెప్మా టీఎంసీపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్ల వాగ్వావాదంతో సమావేశం రసాభాసాగా మారింది. తన వార్డులో వీధిలైట్ వేయాలని ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని 3వవార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు ప్రశ్నించారు. దీనిపై 18వ వార్డు కౌన్సిలర్ యండగండి నాగబాబు కల్పించుకోవడంతో వాగ్వావాదం ప్రారంభమైంది. నగర పంచాయతీలోని 20 వార్డులు తమకు సంబంధం ఉందని నాగబాబు అనగా అభివృద్ధి ఎవ్వరూ చేసినా ఫర్వాలేదని చేతివాటం చేస్తే ప్రశ్నిస్తామని గోవిందు బదులిచ్చారు. దీంతో ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వావాదం జరిగింది. 14వ వార్డు కౌన్సిలర్ మూది నారాయణస్వామి ఇద్దరిని సముదాయిస్తున్న సమయంలో గందరగోళం ఏర్పడింది. ఒక దశలో 20 వార్డులు తమవేనని కూటమి ప్రభుత్వం సభ్యులు అంటున్నారని తమ పనేముందని గోవిందుతోపాటు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు వాకౌట్ చేసే పరిస్థితి నెలకొంది. చివరకు వాతావరణం ప్రశాంతం కావడంతో సమావేశం జరిగింది. అనంతరం తాగునీటి సమస్యకు చెందిన పనులను సభ్యులు అమోదం తెలిపి మిగిలిన వాటిని తిరస్కరించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.సత్యనారాయణ, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణానికి మళ్లీ రాయి వేయడమా..

- ఆంధ్రా ప్రజల చెవుల్లో పువ్వు పెడుతున్న కూటమి
- మాజీ మంత్రి తోట నరసింహం



జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తోట నరసింహం

జగ్గంపేట: అమరావతి నిర్మాణానికి గతంలో జరిగిన శంకుస్థాపనకు వచ్చిన ప్రధాని మోదీ మళ్లీ ఇప్పుడు పునర్నిర్మాణానికి రాయి వేయడానికి రావడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రధాని లాంటి వ్యక్తి అమరావతి ప్రారంభానికి వచ్చి ఉంటే గౌరవంగా ఉండేదని అన్నారు. కాని కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్టుగా అమరావతి పునర్నిర్మాణానికి రావడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని తెలిపారు. అయితే కేంద్రంలో మోదీ బండి నడవాలంటే చంద్రబాబు వెనక నుంచి తోయాలని లేదంటే ఇబ్బందులు ఉంటాయని ఎద్దేవా చేశారు. అమరావతి పునర్నిర్మాణం హడావుడి చేస్తే కూటమి ప్రభుత్వం మళ్లీ ఆంధ్రా ప్రజల చెవుల్లో పెద్ద పువ్వు పెడుతోందని అర్థమవుమవుతోందని విమర్శించారు. గతంలో అమరావతి నిర్మాణానికి వచ్చిన ప్రధాని మట్టి ఇచ్చి వెళ్లారని, కాకపోతే అప్పటికి ఇప్పటికి ఆంధ్రప్రదేశ్ అవసరం ఆయనకు ఉంది కాబట్టి ఏమి ఇచ్చి వెళతారో వేచి చూడాలని అన్నారు. అప్పట్లో తాను కూడా అమరావతి నిర్మాణంపై ఎంతో గర్వంగా పీలయ్యానని దీని కోసం రాజస్థాన్‌లో ఎంతో ప్రాముఖ్యత కలిగిన అజ్మీర్ వెళ్లి ప్రార్థనలు చేసి మట్టిని, పంజాబ్‌లోని అమృతసర్‌లోని గోల్డెన్ టెంపుల్‌లోని సరస్సులో ప్రవిత్ర జలాలను తెచ్చి ఇచ్చామని అన్నారు. కాని రాజమౌళి సినిమాలా అంతగ్రాఫిక్స్‌లో అమరావతిని చూపించి ఊరించడం తప్ప చంద్రబాబు ప్రభుత్వం చేసింది ఏమి లేదని అన్నారు. లక్ష కోట్ల రూపాయలతో అమరావతి నిర్మాణం చేయాలంటే అల్లావుద్దీన్ అద్భుత దీపంలాంటివి ఏమైనా కేంద్రం ఇస్తే పూర్తి కాగలదని అలాంటి పరిస్థితిలు కనిపించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట మండల పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా, పట్టణ పార్టీ అధ్యక్షుడు కాపారపు ప్రసాద్, రామకుర్తి జగాల్, మూర్తి, నేతలు పాల్గొన్నారు.

పహల్గాం ఘటన హేయం



తుని సమావేశంలో మాట్లాడుతున్న సాయిరామ్

తుని: భారతదేశంలో భారతీయులపై జరిపిన ఉగ్రదాడి మానవత్వంపై జరిగిన దాడిగా పరిగణించాలని, ఇది హేయమైన చర్యల అని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ప్రచారకులు ముద్దు సాయిరామ్ అన్నారు. సోమవారం తుని సరస్వతీ శిశుమందిర్‌లో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాయిరామ్ మాట్లాడుతూ సర్వేజనా సుఖినోభవంతు అంటూ శాంతిని కోరే జాతిపై ఇంతటి అమానుషంగా ఉగ్రదాడి జరపడం హేయమైన చర్యగా అభివర్ణించారు. గోదావరి జోన్ ధర్మ ప్రచారక్ తోట జగన్నాథం, ప్రచార ప్రముఖ్ నండూరి కృష్ణ, జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు, జిల్లా కన్వీనర్ కండాల నారాయణరావు, ఎస్.సత్యనారాయణ, కరెడ్ల చక్కి, పంపన బొయిన వరహాలు, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి అమానుషం



తునిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ధార్మిక సంఘం ప్రతినిధులు

తుని: జమ్ము కాశ్మీర్ పహల్గాంలో పర్యాకులపై ఉగ్రదాడి అమానుషమని హిందూ ధార్మిక మండలి తరుపున ప్రముఖ వైద్యులు చిలుకోటి పాండురంగారావు అన్నారు. సోమవారం సాయంత్రం శ్రీరామా సెంటర్ నుంచి గొల్ల అప్పారావు సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో ధార్మిక సంస్థల ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు. హిందూ ధార్మిక మండలి, సమరసత ఫౌండేషన్ సభ్యుడు నండూరి కృష్ణ పాకిస్థాన్ దుశ్చర్యలను ఖండించారు. అనంతరం తుని తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. హిందూ ధార్మిక సంఘం ప్రతినిధులు గేలం శ్రీనివాసరావు, చదరం నరిసింగరావు, కుందెం సత్యనారాయణ, కుమార్, ఆదిత్య, ప్రసాద్, స్వామి, అనురుధ్ వర్మ, గోపాలకృష్ణ, శివ, కాదంబరి రామకృష్ణ, కాశీ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా భువనసుందరి

బాయ్‌కట్ చేసిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు



తుని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ప్రిసీడింగ్ అధికారి రవికుమార్

తుని: మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నార్ల భువన సుందరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కౌన్సిల్ సమావేశం హాలులో ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి, డీపీవో రవికుమార్, ఎన్నికల పరిశీలకుడు, జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్–2 ఎన్నిక నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన 17 మంది కౌన్సిలర్లు హాజరు కాగా వైఎస్సార్ సీపీకి చెందిన 11 మంది కౌన్సిలర్లు బాయ్‌కట్ చేశారు. 18వ వార్డుకు చెందన నార్ల భువన సుందరిని చైర్‌పర్సన్ అభ్యర్థిగా 27వ కౌన్సిలర్ కుచ్చర్లపాటి రూపాదేవి ప్రతిపాదించగా, 24వ వార్డు కౌన్సిలర్ పులి సత్తిబాబు బలపర్చారు. వైస్ చైర్మన్–2గా 19వ వార్డుకు చెందిన అచంట సురేష్‌ను 28వ వార్డు కౌన్సిలర్ చింతకాయల భారతి ప్రతిపాదించగా, 8వ వార్డు కౌన్సిలర్ వాసంశెట్టి శ్రీను బలపర్చారు. పోటీలో మరొకరు లేకపోవడంతో ఇద్దరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రిసైడింగ్ అధికారి రవికుమార్ ప్రకటించారు. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లతో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో ఆమె మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి సమష్టిగా కలిసి పని చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్లు కుసుమంచి శోభారాణి, ఇనుగంటి సత్యనారాయణ, పట్టణ ప్రముఖులు సత్కరించారు. కమిషనర్ వెంకట్రావు, తహసీల్దార్ ప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం



ఏలేశ్వరం గ్రంథాలయంలో సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేస్తున్న విద్యార్థులు

ఏలేశ్వరం: గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో వేసవి శిబిరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మూది నారాయణ స్వామి, శిడగం త్రివేణి, బదిరెడ్డి గోవిందు, బదిరెడ్డి వెంకటరమణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. జాతీయ నాయకులు మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, చదువుల తల్లి సరస్వతీదేవి చిత్రపటాలకు పూజలు చేశారు. ఈ శిబిరాలు వచ్చే నెల 6వ తేదీ వరకు నిర్వహించనున్నారు. విద్యార్థులకు విధిగా విజ్ఞాన శిబిరాలకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో చెన్నాప్రగడ సత్యగాంధీ, వాసా పుల్లయ్య, త్రిమూర్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గండేపల్లి: గుర్తు తెలియని వ్యక్తిని వాహనం ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందినట్టు ఎస్సై యూవీ శివనాగబాబు తెలిపారు. ఆయన వివరాల మేరకు బొర్రంపాలెం సబ్‌స్టేషన్ ఎదురుగా సోమవారం తెల్లవారు జామున హైవేపై జగ్గంపేట వైపు నడుచుకుంటు వెళుతున్న సుమారు 40 నుంచి 50ఏళ్ల వయస్సు గల వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తల నుజ్జు నుజ్జు అయ్యింది. అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుని శరీరంపై నీలం, పచ్చ రంగు కలిగిన టీషర్ట్, నలుపు రంగు ఫ్యాంటు ధరించి నడుముకు టవల్ చుట్టుకున్నట్టు పోలీసులు తెలిపారు. బొర్రంపాలెం వీఆర్వో ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేశామని, ఆచూకీ తెలిసిన వారు సెల్: 94409 04841 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

ఐటీఐలలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

జగ్గంపేట: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఈనెల 28వ తేదీ నుంచి మే 24తేదీ వరకూ స్వీకరిస్తున్నట్లు జగ్గంపేట ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ తెలిపారు. జగ్గంపేట ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, సివిల్ ట్రేడ్స్ ఉన్నట్లు చెప్పారు. ఐటీఐ ఏపీ గవర్నమెంట్ డాట్ ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకుని ప్రింట్ కాపీని మీ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలలో నిర్ణీత సమయంలోపు ఒరిజనల్ సర్టిఫికెట్లతో వెళ్లి వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9440262266 నంబర్‌ను సంప్రదించాలని అన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



యర్రవరం సదస్సులో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. మండలంలోని యర్రవరం గ్రామంలో సోమవారం ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మేలు జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో ప్రజలకు నాణ్యమైన పంటలు అందించవచ్చొన్నారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం సాగుపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.జ్యోతి, సర్పంచ్ బీశెట్టి అప్పలరాజు, మైరాల కనకరావు, తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

ప్రత్తిపాడు రూరల్: నవధాన్యాల సాగుతో భూసారం పెంపొందుతుందని ప్రకృతి వ్యవసాయ ఎంటీఎల్ నికేష్ వర్మ, ఎల్‌టూ బర్ల రామకృష్ణ అన్నారు. పెద్దిపాలెంలో నవదాన్యాల సాగు నేల తల్లి బాగు అనే కార్యక్రమంలో భాగంగా నవధాన్యాల సాగు వల్ల కలుగు ప్రయోజనాలను రైతులకు వివరించారు. వేసవి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నవధాన్యాలను సాగు చెయ్యాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

చల్లబడిన వాతావరణం



గోపాలపట్నంలో కురుస్తున్న వర్షం

తొండంగి: కొద్ది రోజులుగా వేసవి తాపంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు సోమవారం కురిసిన కుండపోత వర్షం ఉపశమనాన్ని కల్పించింది. పది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ఉదయం ఎనిమిది గంటల నుంచే ఉక్కపోత వాతావరణం నెలకొని ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఉంది. దీనికి తోడు తరచూ విద్యుత్ కోతలు తోడవ్వడంతో ప్రజలు మరింత ఇబ్బందిపడ్డారు. అయితే బంగాళాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో సోమవారం సాయంత్రం వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని సుమారు రెండు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. వాతావరణం పూర్తిగా చల్లబడడంతో ప్రజలు సేదతీరారు. ఈ వర్షంతో రబీ వరికోత పనులకు అంతరాయం కలిగింది. ఈదురు గాలుల ప్రభావానికి మామిడి, అరటి తోటలకు నష్టం వాటిల్లిందని పలువురు రైతులు వాపోయారు.

ఊరటనిచ్చిన వర్షం

శంఖవరం: మండలంలో సోమవారం వర్షం కురిసింది. ఎండలో ఇబ్బంది పడుతున్న ప్రజలకు కాస్త ఊరటనిచ్చింది. అచ్చంపేట, ఎస్.జగ్గంపేట, జి.కొత్తపల్లి, గవిరంపేట గ్రామాల్లో ఉన్న అరటి, మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా గాలులు వీచడంతో అరటి తోటలు, మామిడి కాయలు నేలకొరిగాయి. అడపాదడపా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది.

ప్రత్తిపాడులో

ప్రత్తిపాడు రూరల్: మండలం వ్యాప్తంగా సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఎండ తీవ్రతకు అల్లాడిపోయిన జనం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురవడంతో ఉపశమనం పొందారు. వర్షప్రభావంతో విద్యుత్ సరఫరాలకు అంతరాయం కలిగింది.



అచ్చంపేటలో కురుస్తున్న వర్షం

రోడ్డు నిర్మాణంలో నాణ్యత లేదంటూ ఫిర్యాదు

గండేపల్లి: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లేదంటూ ఉప్పలపాడుకు చెందిన సత్తి సోమరాజు, అంకం గంగా శంకర్, ఇనగడపు ఫణికుమార్, వై.అప్పారావు, తదితరులు సోమవారం గ్రీవెన్స్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని తాళ్లూరు హైవే నుంచి ఉప్పలపాడు మీదుగా రాజపూడి వరకూ రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయని, నిర్మాణం ప్రారంభం నుంచి నాణ్యత పాటించకపోవడంతో పలు చోట్ల రోడ్డుపై గుంతలు ఏర్పడుతున్నాయన్నారు. ఎక్కడికక్కడ కంకర రాళ్లు పైకి లేచిపోతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. రోడ్డును పూర్తిగా నిర్మించకుండానే మరమ్మతులకు గురవుతుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే రోడ్డు పనులను పరిశీలించి లోపాలు గుర్తించాలన్నారు.

నోటీసు

మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No.28/2019 in O.S.No.194/2015

ద్వారంపూడి గంగ మధుసూదన రెడ్డి ...DHr

1) ... 2) ... ..JDrs

To:

2) 2nd.JDr

పై నెంబరు గల దావా ... 2nd JDr ... 5.09-05-2025 ... 10.30 ...

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

T.V. నారాయణ రెడ్డి

DHr తరుపు అడ్వకేట్, అనపర్తి, సెల్: 9849...4239